ఆపద్బాంధవి..!

- ఒక్క ఫోన్ కాల్‌తో వాలుతున్న వైద్య సిబ్బంది
- వేలాది మంది ప్రాణాలకు రక్షణ
- జిల్లాలో 15 చోట్ల అందుబాటులో 108 వాహనాలు
- అత్యధిక కేసుల తరలింపులో 'ఎన్‌ఏడీ అంబులెన్స్'రికార్డు



జీవీఎంసీ 52వ వార్డు సచివాలయం వద్ద సిద్ధంగా ఉన్న 108 వాహనం

విశాఖ విద్య: నడుస్తున్న రైలు నుంచి ఎన్‌ఏడీ వద్ద ఓ వృద్ధుడు జారిపడిపోయాడు. తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లిన వెంకటేశ్వర్లు అనే యువకుడు 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. శాంతినగర్ కమ్యూనిటీ హాల్ పాయింట్‌లో రెడీగా ఉన్న 108 వాహనంతో వైద్య సిబ్బంది క్షణాల్లో అక్కడికి వాలిపోయారు. ఆ వృద్ధుడికి అత్యవసర వైద్యం అందించి, హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. సకాలంలో పెద్దాస్పత్రికి తరలించడంతో ఆ వృద్ధుడి ప్రాణాలు నిలిచాయి. 108 వాహనం తన పాలిట ఆపద్బాంధవిగా నిలిచిందని ఒడిశాకు చెందిన ఆ వృద్ధుడు ఆనందం వ్యక్తం చేశాడు. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

ఒక్క ఫోన్ కాల్ తో కుయ్ కుయ్ అంటూ ఇంటిముందు వాలే 108 అంబులెన్సులు ఆపత్కాలంలో ప్రజలకు అండగా నిలుస్తున్నాయి. ప్రాణాపాయంలో ఉన్నవారిని రక్షించి అందరి మన్ననలు పొందుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులకు విశిష్ట సేవలు అందిస్తున్నాయి. వాహనాల్లో పనిచేసే సిబ్బంది తమ అనుభవంతో డాక్టర్లతో సమానంగా సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని 15 పాయింట్లలో '108 వాహనాలు' అందుబాటులో ఉంచి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 37 మంది టెక్నీషియన్లు, 39 మంది పైలట్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు 24/7 సేవలందిస్తున్నారు.

తల్లీబిడ్డల సంరక్షణలో..

గర్భిణులకు 108 ద్వారా విశేష సేవలు అందిస్తున్నారు. నగర శివారు కాలనీల్లో ఉండే గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడినప్పుడు అక్కడికి వెళ్లే 108 సిబ్బంది తమ సేవలతో ఆ కుటుంబాల్లో ధైర్యం నింపుతున్నారు. ఒక్కో సారి అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రుల్లో అడ్మిట్ చేస్తున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు, ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరిగాలనే జిల్లా యంత్రాంగం లక్ష్యాలకు 108 వాహనాల సిబ్బంది విశేషంగా తోడ్పాటు అందిస్తున్నారు.

ఎన్‌ఏడీ ఏరియాలో..

జిల్లాలోని 15 చోట్ల అందుబాటులో ఉన్న 108 వాహనాల్లో ప్రతీ నెలా 3 వేల వరకు అత్యవసర కేసులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వీటిలో ఎన్‌ఏడీ శాంతినగర్ పాయింట్‌లో ఉన్న వాహనం కేసుల తరలింపులో తొలిస్థానంలో నిలిచింది. గాజువాక, పెదగంట్యాడ పాయింట్ల వద్ద ఉన్న సిబ్బంది సైతం ఎక్కువ కాల్స్‌కు అటెండ్ అవుతున్నారు.


పోర్టు ఏరియాలో అంబులెన్స్‌లోనే డెలివరీ చేసిన సిబ్బంది (ఫైల్)



బాధితుల్లో ఆనందం సంతృప్తినిస్తోంది



రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎవరు ఫోన్ చేసినా వెంటనే వెళ్లి బాధితులను ఆస్పత్రులకు తరలిస్తాం. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో ఆస్పత్రులకు తరలించడం ద్వారా అనేక మంది ప్రాణాలు నిలిచాయి. బాధిత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేసినప్పుడు ఎంతో సంతృప్తిగా ఉంటుంది.

– పరమేశ్వరరావు, పైలట్, ఎన్‌ఏడీ ఏరియా

అప్రమత్తంగా ఉంటాం



అన్ని వేళల్లో అప్రమత్తంగా ఉంటాం. వాహనాల నిర్వహణపై ఎప్పటికపుడు పరిశీలన ఉంటుంది. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించి బాధితులను వీలైనంత త్వరగా ఆస్పత్రులకు తరలించేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ప్రమాద సమయంలో ప్రాణాలతో బయటపడ్డ వారి కళ్లల్లో ఆనందం చూసి సంతృప్తి లభిస్తుంది.

– ఎం.సురేష్, 108 సర్వీసుల జిల్లా మేనేజర్

సకాలంలో స్పందిస్తున్నారు



అత్యవసర సమయంలో ఆస్పత్రులకు తరలించేందుకు ఒక్క ఫోన్ చేస్తే చాలు 108 సర్వీసుల వారు సకాలంలో స్పందిస్తున్నారు. ప్రాణాపాయం నుంచి బయటపడేసేలా వైద్య సిబ్బంది ఎంతో బాగా సేవలు అందిస్తున్నారు. ఆ పత్కాలంలో 108 నిజంగా సంజీవనిగా నిలుస్తోంది.

– కోనాల విజయ వినీత, కాకాని నగర్, ఎన్‌ఏడీ ఏరియా

క్లుప్తంగా

పరామర్శ


గోవింద్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురం గ్రామ మాజీ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్ము గోవింద్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ పరామర్శించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గోవింద్‌ను సోమవారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గోవింద్‌కు మెరుగైన వైద్యం అందించాని వైద్యులకు సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా క్రీడా సంబరాలు


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ మర్రిపాలెం రోడ్‌లోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో క్రీడా ఉత్సవాలు సోమవారం అత్యంత కోలాహలంగా జరిగాయి. శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ వైజాగ్ సిటీ రీజనల్ ఇన్‌చార్జి అహ్మద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ,శారీరక ,ధృఢత్వం కలిగిస్తాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జె.మహేష్ మాట్లాడుతూ క్రీడలు,వ్యాయామం వల్ల మానసిక ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత సాధ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమం లో ప్రైమరీ ఇన్‌చార్జి బి.సోనియా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


క్యాంప్‌ను పరిశీలిస్తున్న రమణ

విశాఖ విద్య: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో సోమవారం నుంచి ఈ నెల 16 వరకు నిర్వహించనున్న ఆధార్ క్యాంప్ ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ రమణ మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఉన్న తప్పిదాలను కూడా ఈ శిబిరంలో సవరించుకోవచ్చన్నారు. బుచ్చిరాజుపాలెం పరిసర కాలనీ వాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు


అర్జీదారుడి సమస్య వింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేసి, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కార్యక్రమంలో 4 వినతులు అందాయని తెలిపారు. వినతుల్లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2, యూసీడీ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 1 చొప్పున ఉన్నాయన్నారు.

అధికారులతో సమీక్ష

సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, ఆర్వో బాబురావు, రాజ్యలక్ష్మి, ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగంలో పని చేస్తున్న డాక్టర్ డి.మురళీకృష్ణ బీకాం, ఎంకాంలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి పది పుస్తకాలను రచించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు అన్నారు.

ఈ పుస్తకాలలో రెండింటిని సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రవికుమార్, శ్రావణ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు జగ్గునాయుడు

మల్కాపురం: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరగబోవు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. సమ్మెను పురస్కరించుకుని ఇండస్ట్రియల్ ఏరియా పరిధి అఖిల పక్షల కార్మిక సంఘాల నాయకులు సోమవారం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను వివిధ పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా,నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి వేసిందని ఆరోపించారు.ఈ లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక మంది త్యాగమూర్తుల ఫలం విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఆ త్యాగమూర్తుల చేసిన త్యాగాలను ఈ మోదీ సర్కార్ తుంగలోకి తొక్కి ప్లాంట్‌ను ప్రైవేటీ కరణ చేయాలని సంకల్పించిందని మండిపడ్డారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణరావుయాదవ్,ఏఐటీయూసీ నాయకుడు గుండాల రాంబాబులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధనాల వల్ల లక్షలాది మంది కార్మికుల జీవితాల్లో చీకటి కమ్ముకుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న జరగబోవు పారిశ్రామిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1096వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులతో పాటు గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. రానున్న కాలంలో ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మొల్లి అప్పారావు, నెల్లి అప్పలరాజు, పోలవరపు రమణబాబు, జైకుమార్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు.

అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

వర్క్స్ కమిటీ ఎన్నికల్లో ఎన్‌ఏడీ సీఈ యూనియన్ విజయం


గెలుపొందిన వర్క్స్ కమిటీ సభ్యులతో సీఈ యూనియన్ నాయకులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ తన హవా చాటుకుంది. భీమిలి ఎన్‌ఏడీలో జరిగిన వర్క్స్ కమిటీ ఎన్నికల్లో సీఈ యూనియన్ సభ్యులు ముగ్గురు విజయం సాధించారని ఎన్‌ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల జరిగిన కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో తమ యూనియన్‌కు అండగా నిలిచి విజయాలు అందించిన కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భీమునిపట్నం ఎన్‌ఏడీలో మొదటి సారిగా జరిగిన వర్క్స్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన నాయక్, గణేష్, రవిలను యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నూకరాజు పాల్గొన్నారు.

ఏపీఎండీసీకి ఏయూ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ముగ్గురు ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూ ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సు చదువుతున్న ఎం.రవిశ్రీ కిరణ్, ఎం.ఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఏపీఎండీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, ఆర్ట్స్–కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్, తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 700 మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తెలిపారు.

పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

సిబ్బందికి ఏపీ సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఆదేశం


పెద్దిపాలెం పోలింగ్ బూత్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీఈవో ముఖేష్ కుమార్ మీనా

ఆనందపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్దిపాలెంలో ఏర్పాటు చేసిన 86, 87 పోలింగ్ బూత్‌లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగుల కోసం రెయిలింగ్, ర్యాంప్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మంచినీరు, విద్యుత్, వెలుతురు వంటి సౌకర్యాలు తప్పకుండా కల్పించాలన్నారు. సౌకర్యాలు కొరవడిన దగ్గర మూడు రోజుల్లో నూరు శాతం సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ బీఎల్‌వోల వద్ద గల రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకుని, ఓటరు జాబితా పరిశీలించారు. ఆయనవెంట ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ తదితరులు ఉన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్

- ఆటోలో వెంబడించి వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అక్కిరెడ్డిపాలెం: వాకింగ్ చేస్తున్న వృద్ధురాలిని ఆటోలో వెంబడించి, ఆమె మెడలో బంగారు గొలుసు, నగదు చోరీ చేసిన ముగ్గురు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆ బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురానికి చెందిన షియా ప్రసాద్‌సింగ్ (84) గత నెల 24వ తేదీన గొందేశిపాలెంలో వాకింగ్ చేస్తుండగా.. పెదగంట్యాడకు చెందిన చేపల ఆనంద్, కంబాల శ్రీ రాజు, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజు ఆటోలో వెంబడించి ఆమె మెడలోని తులం బంగారు చైన్‌ను తెంచుకుపోవడంతో పాటు, ఆమె వద్ద గల నగదును కూడా లాక్కుని పరారయ్యారు. ఆమె వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి.. సీసీ ఫుటేజ్ ద్వారా దొంగల ఆచూకీని కనిపెట్టారు. విచారణలో ముగ్గురూ నేరం చేసినట్లు తేలడంతో, సోమవారం వారిని అరెస్ట్ చేసి, బంగారం, నగదుతో పాటు మద్యం సీసాలు, ఇనుప రాడ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన దిగువ జాలారిపేటకు చెందిన సీహెచ్ ఎల్లాజీ (35)ని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏడీసీపీ గంగాధరం, జోన్–2 క్రైం ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మధరావు, ఏఎస్ఐ రవి, కానిస్టేబుళ్లు కేసును దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించగలిగారన్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిపారు. ఆటో నంబర్ ప్లేట్ సరిగ్గా లేకపోయినా, పాతకేసును తిరగదోడి నిందితులను గుర్తించారని, సీసీ ఫుటేజ్ ద్వారా వారిని పట్టుకోగలిగారని తెలియజేశారు.

సైకాలజీ విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సుల్లో పాల్గొని, పలు అవార్డులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల నూతన జ్ఞానాన్ని నిపుణుల నుంచి పొందడం సాధ్యపడుతుందన్నారు. శాస్త్ర సంబంధంగా జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరాలి


పాత్‌వే ప్రారంభిస్తున్న సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

కొమ్మాది: ఆత్మవిశ్వాసంతో అంధ విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ సూచించారు. సాగర్ నగర్ సమీపంలో గల అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పాత్‌వే (నడక మార్గం)ను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజీఎస్‌టీ డిపార్టుమెంట్ రూ.3.50 లక్షలతో పాఠశాలలో పాత్‌వేను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా భోజనం అందజేత



భోజనం అందజేస్తున్న సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విక్టోరియా(ఘోషాస్పత్రి) ఆస్పత్రి వద్ద కొంత కాలంగా నిర్వహిస్తున్న రూ.10కే భోజనం విజయవంతంగా కొనసాగుతోంది. ఆస్పత్రికి వచ్చే పేషెంట్ సహాయకులు, ఓపీకి వచ్చే రోగుల కోసం నాణ్యమైన భోజనాన్ని 290 రోజులుగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మసూద్ అహ్మద్ మాట్లాడుతూ అన్నం, కూర, రసం తయారు చేయడానికే రూ.35 ఖర్చు అవుతుందని, అయినప్పటికీ దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం రూ.10కే అందజేస్తున్నట్టు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, కోశాధికారి సీహెచ్.పైడిరాజు పాల్గొన్నారు.